# జాతకం

''ఎదిగిన ఆడపిల్ల గుండెల మీదకుంపటి ! మీకు పట్టదు ! నా తల్లికి అసలు ఆ కళ్యాణ రేఖ ఉందో లేదో !'' పార్వతమ్మ ఉస్సురని నిట్టూర్చింది. కళ్ళనీళ్ళు తిప్పుకుంది. భర్తలో చలనం లేకపోవడం చూసి సర్రున లేచింది.

'' ఆడవాళ్ళు ఆడవాళ్ళని మమ్మల్ని ఇలా చుట్టేస్తారు. ఇంటి ఇంటెడు చాకిరీ చేయడమే కాని మాతో ఏ విషయమూ సంప్రదించరు కదా ! మా చాకిరీ కావాలి ; మా సలహా ఎవరిక్కావాలి ?''

ఆవిడ అగ్గిమీద గుగ్గిలం అయిపోతూ ఉంటే పరమేశ్వర్రావ్ గారు పంచాంగం చూస్తూ ఎవరిదో జాతకచక్రం రాస్తున్నారు. వేళ్ల గుణుపులు లెక్కించుకుంటూ తీవ్రమైన ఆలోచనతో కట్టిన లెక్కలను పలక మీద వేసి సరిచూస్తున్నారు.

చటుక్కున ఏదో ఆలోచన వచ్చి 'భారతీ భారతీ !'' అంటూ పిలిచారు.

''భారతి పెరట్లో నూతి దగ్గర ఉంది. ఎదురుగా ఇంతసేపటి నుంచి ఇలా అఘోరిస్తూ ఉంటే దాన్ని కేకేస్తారేం ? మీకు కాగితం ఇవ్వడానికి నేను పనికిరానా ?''

''వెర్రిదానా ! ఆవేశం వల్ల ఎప్పుడయినా అనర్థానికి మించి మరేమయినా వచ్చిందా ! పిల్ల నీ పిల్లేనన్నట్టూ నాది కానట్టూ దాని పెళ్ళి బాధ్యతని ఒక్కనువ్వే మోస్తున్నట్టు అలా అదరగొట్టేస్తున్నావ్!... ఇంత మంది జాతకాలు చూస్తున్నాను. ఆ యోగం దానికి రావాలి... వస్తుంది. నువ్ గొంతు చించుకుంటే నేనయితే చలిస్తానేమో కాని ఆ గ్రహాలు పట్టించుకునేనా ?''

''అవుననుకోండి !'' కొంచెం చల్లబడింది పార్వతమ్మ.

''పిలిచారా నాన్నా!'' అంటూ భారతి వచ్చింది.

''అమ్మాయ్ !.... ముఖ్యమైన విషయమమ్మా ! మీ అమ్మ నిజానికి నిన్నడగాల్సిన మాట... విసురూ, వేగమే తప్ప దానికి ఆలోచన తక్కువ... మావయ్య కొడుకు విరించిని నీకు బాగా తెలుసుకదా... నాకయితే మా అక్క కాదనదన్న ధీమా ఉంది దగ్గర సంబంధం..''

''మా గొప్ప నిర్వాకం.... పెద్ద పిల్ల ఇంట్లో మొదటి కార్యం.... బియ్యే చదివిన పిల్లను ఆ టెన్తు పాసయిన వాడికా ? పిల్లకి పెళ్లి చెయ్యమని అడిగాను కాని, గొంతుకు గుదిబండ కట్టమని కాదు చాలు మీ నిర్వాకం....'' వెంటనే తుంచేసింది పార్వతమ్మ.

భారతి తలదించుకుని పక్క గదిలోకి వెళ్లిపోయింది.

పరమేశ్వర్రావ్ చేసేది పౌరోహిత్యం... ఏనాడో చదివిన మూడోఫారం చదువు. కొద్దిగా భూమి తాతలనాటిది – ఒక్కతే ఆడపిల్ల ఇద్దరు మొగపిల్లలు – పెద్దది ఆడపిల్ల. సాధ్యమైనంత ''పెద్ద'' సంబంధం చెయ్యాలని ఆవిడ ఆత్రం.

పరమేశానికి కూతుర్ని అక్క కొడుక్కి ఇవ్వాలని ఆశ. సంప్రదాయం తెలిసిన మనిషి కావటాన్న పెద్ద చదువుకున్నవాడు కాకపోయినా ఊళ్లో మంచిపేరు తెచ్చుకున్న మనిషి. ఎవరు జాతకాలు రాయించుకోవాలన్నా, ముహూర్తాలు పెట్టించుకోవాలనుకున్నా పరమేశం గారి దగ్గరకు రావాల్సిందే. పుణ్యావాచనం దగ్గర నుంచి పెళ్లి వరకూ ఆయనచేత చేయించుకుంటేనే మంచిదని ఊరి ప్రజల విశ్వాసం. స్థితిపరులు కాకపోయినా దేనికీ లోటులేని సంసారం –

పరమేశ్వరరావ్‌గారి అక్క హైదరాబాదులో కాపురానికి వెళ్లింది. కొడుకు టెన్తు అయ్యాక మూడేళ్లు పాలీటెక్నిక్ చదివి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమా పొందాడు.

అయితే బియ్యే చదివిన పిల్లకి టెన్తు వాడి కివ్వడమేమిటనేస్తుంది పార్వతమ్మ. పాలీటెక్నిక్ చదవడం కాలేజీ చదువు కాదనీ, వర్క్‌షాప్‌లో చేసే ఉద్యోగానికి గవర్నమెంట్ హోదా లేదనీ ఆవిడ వాదన.

– ఆడపిల్లని తను అడగడమేమిటని పరమేశం అక్క విశాలాక్షి మెదలకుండా ఊరుకుంది.

లెక్కలు కట్టి రెండు జాతకాలు చూశాడు పరమేశం. మనసులో ఏదోమెర – జాతకాలు కుదరడం లేదు. భార్య చూడబోతే అసలు సంబంధం వైపు మొగ్గు చూపడం లేదు.

రాత్రంతా నిద్రలేదు పరమేశ్వరంగారికి. అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాడు. తెల్లారి పట్నం బయలుదేరాడు. సంబంధం చూడడానికి బయలుదేరుతున్నాడని పార్వతమ్మకి తెలిసిపోయింది.

ఎదురుగా నీళ్ల బిందెతో ప్రత్యక్షమైంది శకునం బావుండాలని ఆవిడ ఆత్రం.

సాయంకాలానికి ఊరి నుంచి వచ్చిన భర్త ఆమెతో ఏమీ మాటాడలేదు.

పార్వతమ్మకి సంబంధం విషయం తెలుసుకోవాలని ఆత్రం, భర్తని ఎన్నోసార్లు అడిగింది పట్నం వెళ్ళిన పనేమయిందని... పరమేశం నిదానంగా ఆవిడ వంక చూసి మెల్లగా చెప్పాడు.

''చూడు పార్వతీ... అది నీకే కూతురు కాదు... ఆ ఆలోచన నాకొదిలెయ్.. పెళ్లన్నది వెయ్యేళ్ల పంట. చాలా విషయాలు చూడాలి... ముక్కూ మొహం తెలియని ఇంట్లో అమాయకురాలు... చూస్తున్నాం కదా ! వింటున్నాం కూడా ... ఈ రోజుల్లో కట్నం బెడద.... పెట్టుపోతలు జరగడం లేదని స్వార్థంతో కోడంత్రికాలు, బియ్యే చదివిన పిల్లని చేసుకోడానికి ఎమ్మే వెదకాలంటావ్ !... ఎమ్మే వాడంటే నలభై వేల కట్నం మన వశమా ?.... భగవంతుడ్ని నమ్ముకున్నవాడిని. ఆయనే నాకు శరణ్యాం.. నా భరోసా...

వేదాంతం మాటాడినట్లనిపించింది పార్వతమ్మకి.

'' ఇంతకీ వెళ్ళిన పని ?''

''అదే అవుతుంది !'', మరేం చెప్పలేదు పరమేశంగారు.

వారం రోజుల్లో ఉత్తరం వచ్చింది. పల్లెటూర్లో ఉత్తరం రావడమే వింత.

కవరు చింపి మెల్లగా చదువుకున్నాడు పరమేశం.

గదిలోంచి తండ్రి చెప్పబోయే కబురు కోసం భారతి వింటోంది.

పార్వతమ్మ అడిగింది మెల్లగా ''ఎక్కడి నుంచండీ ఉత్తరం...?''

''అక్క!... ఇంద !'' అని ఇచ్చేశాడు.

భారతి లోపల నుంచి బయటకు వచ్చింది.

తమ్ముడు పరమేశానికి అక్క దీర్ఘాయుష్షుగా దీవించి వ్రాయు ఉత్తరం.

ఉభయకుశలోపరి.

నువ్ రాసిన ఉత్తరం అందింది శాస్త్రులుగారూ ఉత్తరం రాశారు.. అబ్బాయి ఇష్టమంటున్నారు మీ బావగారు. వాడు నీ ఇష్టం అంటున్నాడు... ఏదో సాకు అనుకోకు. ఈ కాలం పిల్లల సంగతి మనకు తెలుసుగా. వాళ్ల మనసులో మాట మనం తెలుసుకోవాలి. వాళ్ల సుఖం, ఆనందం, శాంతి వీటికంటె మనకేం కావాలి.. అబ్బాయి ఇష్టపడ్డాడని నేను ధైర్యంగా చెప్పగలను. కాని... ముఖ్యమైన

విషయం... భారతిని అడుగు... దానికి ఇష్టమైతే శాస్త్రులుగారి చేత ముహూర్తం పెట్టించు. వచ్చే నెలలో ఏవో ముహూర్తాలు ఉన్నాయని అంటున్నారు... తూగలేనని అనుకోకు... వాడికి కట్నం మీద మోజులేదు - బావగారి సంగతి తెలుసు కదా ! కట్నం ఇవ్వను, పుచ్చుకోను అంటున్నారు... ఆడపిల్లలేని దాన్ని భారతిని చేసుకుంటే కూతురులా చూసుకుంటాను. ఆర్భాటంగా చెయ్యవద్దంటున్నాడు.... విరించి .... నువ్ భారతిని తీసుకుని వస్తే దానికి కావాల్సిన చీరలూ అవీ ఇక్కడే కొనుక్కోవచ్చు... మరదలికి ఆశీస్సులు

- అక్క

''బావుందండీ ! అయితే ఇదేనన్న మాట మీ నిర్ణయం'' ఉస్సురంది పార్వతమ్మ.

''పార్వతీ !... నేను మహా పండితుడిని కాను... జాతకాలు నప్పలేదు నా అంచనాలో కాని... శాస్త్రులుగారు రెండు జాతకాలూ చూశారు... నా గుణింతంలో పెద్ద తప్పు దొర్లింది. అది నీతో చెప్పలేక మనస్సులో ఇముడ్చుకోలేక నానా హింసలూ పడ్డాను. ఆ రోజు ఎందుకో ఆ ఆలోచన వచ్చింది. శాస్త్రులుగారు శాస్త్రాన్ని విడమరిచి చెప్పి నన్ను నమ్మించడమేకాక అక్కకీ ఉత్తరం రాశారు. ఆయన అభిమానం చూడు... మన పెళ్లి ముహూర్తం ఆయన పెట్టిందే... నీ తెలివితక్కువగాని పాలీటెక్నిక్ చదివి సాంకేతిక విద్యలో పట్టం తెచ్చుకున్నవాడు మన అమ్మాయికి తగడని ఎలా అనుకున్నావ్ ?... నీకు తెలియదు. అక్కకి వచ్చిన ఆలోచనే నాకూ వచ్చింది.

ఈ విషయం మీద నిర్ణయం మనదెవరిదీ కాదు... భారతిదే !... భారతీ ఈ ఉత్తరం చదువు...''

అంటూ భారతికి ఉత్తరం అందించారు పరమేశంగారు.

''అమ్మకి....'' భారతి అంది. ఆమె ముఖం చూడగానే పరమేశంగారు నవ్వుతూ అన్నారు.

''మీ అమ్మకేం తెలుసమ్మాయ్... నే ఉదయాన్నే శాస్త్రులుగారు దగ్గరికి వెళుతున్నా ! ఏం, పార్వతీ...''

''జాతకాలు వేయడం మీకే తెలుసు !'' అంది పార్వతి కసిగా.

అయినా ఆవిడ మీద కోపంలేదు పరమేశం గారికి.

''శాస్త్రంలో తప్పుండదు... అధ్యయనం లోనో, అన్వయంలోనో దోషం ఉంటే అది శాస్త్రం తప్పు కాదు. శాస్త్రులుగారు చెప్పిన మాట అదే !'' పార్వతి ముఖం వికసించింది.

**జాగృతి**

1984